కథానిక

# హృదయ ఛురికలు

అంగర వెంకటకృష్ణారావు

మెడ్రాస్ మెయిలులో వెళ్ళిపోతూన్న స్నేహితుడివెంపు చూస్తూ, చేతిరుమాలు ఆడిస్తూ పరాకుగావున్న సమయంలో, వీపుమీద ఫెడీల్ని చరిచి 'ఏమిరోయ్' అని అరిచాడు. ఉలిక్కిపడి వెనుదిరిగి చూసేసరికి వర్షాగమం సూచించే బొంద్రుకప్ప అరుపువలె నవ్వుతూ, గుప్పున సిగరెట్టుపొగ వదిలాడు, ముఖంమీదికి.

'ఓరి శుంఠా! నువ్వట్రా, ఘోషాల్! నువ్వు! ఇక్కడ! ఎక్కడికి వెడుతున్నావు?'

నాపంట్లాం కుడిజేబులో తన యెడమచేతి వ్రేళ్లు దూర్చి ముందుకు యీడుస్తూ, ఒక్కదమ్ము లాగి—'రా ముందు, టీ తాగుదాం' అన్నాడు రౌడీగా నవ్వుతూ.

నాలో ఆశ్చర్యం, ఆనందం కుప్పిగంతులేస్తున్నాయి. జీవితగ్రంథపు పేజీలు ఆ సన్నివేశపు గాలికి రెపరెప వెనక్కితిరిగాయి. ఘోషాల్! ఎక్కడివాడు— ఎక్కడికొచ్చాడు! ఎన్నెన్నో సంగతులు తెలుసుకోవాలి—నా ఆత్రుత పురకలు వేస్తూంది.

ఘోషాల్ పూర్తిగా మారిపోయాడు. బుగ్గలు గాలిపోయిన బెలూన్‌వలె చప్పపడిపోయాయి. విశాలనేత్రాలలో జీవితపు తళుకు నశించిపోయినా, చితికిపోయిన దివాణంలో విరిగి వ్రేలాడుతూన్న 'లస్టర్'ల వలె ఒక మెరుగు గోచరిస్తూంది.

టీ తాగి, మరొక సిగరెట్టు వెలిగించి, దమ్ము లాగి పరీక్షగా వెలుగుతూన్న వెంపు చూస్తూ, కణకణలాడుతూన్న అగ్నిమీద పొగవూదాడు.

'బినోయ్‌బాబు క్షేమంగా వున్నారా' అని ప్రశ్నించాను. పత్రికలమ్మే కుఱ్ఱవాడిని రమ్మని సైగజేస్తూ, అలక్ష్యంగా 'స్వర్గంలో' అన్నాడు. నాముఖంలో విచారం గమనిద్దామని వుద్దేశమేలేదు వాడికి. నే నింక పరామర్శించే దేముంది!

కాని బినోయ్‌బాబు నన్ను కన్నకొడుకువలె చూసేవాడు—అతనికి వుండేది చిన్న సాహిత్య వాసన. రవిఠాకూరు కన్న మైకేల్ మదుసూదన్ దత్తు పెద్దకవి అని, అతని 'మేఘ్‌నాధ్' తో సరితూగే రచన ఒకటీ ఠాకూర్ వ్రాయలేదని వాదించేవాడు—'కానైతే రావుబాబూ! "మానస సుందరి" వ్రాసి ఆడదాన్ని నక్షత్రమండలానికి ఎత్తినవాడు, "స్త్రీ" వ్రాసి ఆమెనే జుట్టుపట్టుకుని పాతాళానికి అణగదొక్కాడు—ఉద్దండప్రతిభా ధురీణుడు— —గురుదేవుడు యింతకీ గురుదేవుడే'— అనేవాడు నవ్వుతూ.

"క్రిష్ణోదా-మీదేశం వచ్చినప్పుడు-నీ'చిన్నారి' చిగురాకు చేతులతో పాయసం వండించి వడ్డింపిస్తానన్నావే-దొంగా, రా ననుకున్నావా-ఇప్పుడు వచ్చావుగా-పద యింటికి" అన్నాడు ఘోషాల్.

నా ముఖం విషాదమేఘాచ్ఛాదితం అయింది. నేనూ జీవితంలో అప్పుడే ఒక చిన్న దెబ్బ తిన్నాను-ఏస్వప్న దేశాంతరంలోనో నాకోసం ఒక మల్లిక కోరకించింది. ఇంకా దాని పరిమళమైనా నన్ను చేరలేదు-హటాత్తుగా ఆ దేశంనుంచి కొట్టుకువచ్చిన సమీరకుమారుడు నా చెవిలో గొణిగిపోయాడు, 'మల్లిక రాలిపోయిం'దని.

ఇది వింటూ ఘోషాల్ వాసాలవెంపు చూసి, 'యింతేనా' అన్నట్టు ముఖం అదోలా పెట్టి సిగరెట్టుపొగ పైకి వూదుతూ, ధూమచక్రాన్ని ఎడమ చేతితో పట్టుకోబోయి వెకిలిగా నవ్వాడు-దానిలో ఏం వేదాంతం వుందో!

నేను హృదయాన్ని సమాళించుకుని 'దాదా-మళ్లీ రావాలోయ్ నౌవాఖాలీ- శేఫాలి యిది వరకులా నావద్దకువస్తుందా—ఈ పాటికిబాగా ఎదిగి వుండాలి-పదమూడు వెళ్లుంటాయి. ఔను, నాలుగేళ్లు దాటాయి— నేను ఆఖరితడవ నౌవాఖాలీ వచ్చి. కాని దాదా-శేఫాలిని తల్చుకొని రోజు

లేదు-నావొళ్ళో కూచుని-చెవులుపట్టుకుని ఆడిస్తూ చేసినైతే మరిచిపోయ్యానో దానిని జ్ఞప్తితెచ్చుకొన ప్రయత్నించకపోవడం వుత్తమం అనే పాట పాడుతూంటే-నా కిల్లాంటి చెల్లెలుంటే ఎంత బావుండు ననిపించేది. కుంభవృష్టిగా మూడేసి వారాలు అహోరాత్రాలు వర్షిస్తూ, ఆకాశం యీ కొసనుంచి ఆకొసకి రోళ్లు దొర్లిస్తున్నట్టు వురుముతూంటే- శేఫాలి అనేది- అదిగో వసంతుడు హేమంతుడు రణభేరీలు మ్రోగిస్తూ యుద్ధం చేస్తున్నారని-అచ్చంగా అంతా మీ అమ్మగారే-ఔనన్నట్టు మీఅమ్మ క్షేమంగా వున్నారా... పాపం—ఆవిడకి యీ నాటికీ కష్టం.'

పేపరుమీద కళ్లు పరుగెత్తిస్తూ నా వెంపు చూడకనైనా చూడకుండా 'దాదా-ఎవరికీ యేమీ కష్టంలేదు. అంతా హాయిగావున్నారు. వాళ్ళంతా కలిసి ఆనందాతిశయంతో నవ్వుకుంటూన్న స్థలానికి నువ్వూ నేనే తక్కువైపోయాం - అమ్మ, నాన్నగారు. శేఫాలి...' అని బ్రేకుపడ్డట్టు ఆగిపోయాడు. వెంటనే సర్దుకుని వెనక్కి తిరిగి మరి రెండు కప్పుల 'టీ' తెమ్మని చెప్పాడు కుఱ్ఱాడితో.

మానవజాతి తక్కువ కాలపరిమితిలో ఎన్నెన్నో అవస్థాభేదాలు అనుభవించే ఊసరవెల్లివంటి కాలానికి చెందిన వాడిని నేను. అందుకు గర్వించాలో, దుఃఖించాలో తెలీదు. నలభై ఏండ్ల వయస్సువచ్చిన వరకూ జీవితం అంటే యేమిటో తెలీక ఆపైన ఏ తండ్రో, గార్డియనో చచ్చిపోతే, సంతానవంతులై నప్పటికీ-'రేపు ఎలాగు' అనుకున్న వాళ్ళగురించి విన్నాను. ఇంకా అంతకు పూర్వం డెబ్భైయేళ్ళపాటు జీవిత కార్యక్రమంలో సూది మొనవాసి తేడా లేకుండా గడిపిన వాళ్ల గూర్చికూడా విన్నాను. కాని నేడో! స్మశానం పిలుస్తూన్న సహస్రమాసజీవి, పార తట్ట పట్టుకుని కూలీకి పోతూన్నాడు. ఏడేళ్ల బాలుడు చలిలో తెల్లవారగట్ల నాలుక్కి లేచి హోటల్లో వుద్యోగానికి పోతూన్నాడు.

బెంగాలు క్షామనిధి జాబితాలో నీపేరు కెదురుగా ఖాళీగావుండి పోడంనుంచి 'రిటర్న్' ఆపి వేయవలసి వచ్చింది అంటే శోభాకుమారి నావెంపు అలస నేత్రాలతో చూసి. అధరం కొరుక్కొని, దీర్ఘ నిశ్వాసం విడిచింది - వూరుకోక 'నువ్వు సొంటులువు - పెద్ద జీత కత్తెవు - యింత పీనాసితనం కూడదు. యిది మీవాళ్ళకే' అన్నా. 'ఆమె వెక్కి-వెక్కి యేడ్చింది. అభ్యుదయ ఆశయాలు నన్ను నెట్టలేదు యీ వుద్యోగానికి. ఆకలి మంటలు చుట్టబెట్టి పొట్టపెట్టుకున్నాయి. క్షేమ పిశాచపు ఇనుప జోడు క్రిందపడిన ఒక కంకరరాయి మా పెద్ద కుటుంబం' అంది మానవ జీవితావనికగూడ కాలం చేసిన రంగులలో అదొకటి.

ఈ నిర్దాక్షిణ్య కాలంలో హృదయం కలవాడు నరకయాతన పొందుతాడు నావలె.

ఎన్నెన్ని దేశాలు తిరిగానో అన్నిచోట్లలా ఈ హృదయారామంలో లెక్కలేనన్ని కుసుమాలు వికసించాయి. భారతవర్షం సంకెళ్లు తెగాయి. కాదు, కాదు. అమాయకుల కంఠ సహస్రాలు తెగాయి. వాటిలోంచి చిమ్మిన వుడుకు నెత్తురు యీ హృదయకుసుమాలపై పడి వాటిని హృదయ వ్రణాలుగా మార్చింది.

రాత్రి పదిగంటలకి రోజూ వినేవాడిని 'రామొక్రిష్ణో, రామొక్రిష్ణో'-అదేపాట, అదే నడక, అదే మాధురి - ప్రతి రాత్రి పదిగంటలకి నోవాఖాలీలో 'సేన్ కంట్రాక్టరు' యింటి ప్రక్క మేడలోంచి వినబడేది. ఆ శారీరంలోని మార్దవం హృదయపు లోతులలో జొరబడి అక్కడి వల్లకీ తంత్రులని కదిపేది. చీకటిలో ఎవ్వరికీ కనుపించకుండా వింటూంటే—'రాగ పరిచితు డెవ్వడో రమ్య గీతి వినియెయ్యుండు నానందమువెల్లివిరియ' అన్న కవి హృదకుహర ప్రతిశబ్దిత వాక్యాలు జ్ఞాపకానికి వచ్చాయి. ఆ గాయని దుర్గాపూజలలో ఒకనాడు తొలిసారి ప్రత్యక్షం అయింది. నా హృదయారామంలో సద్యోకుసుమితం అయిన మరొక్క రోజావలె. అదే నేడు మరొక్క వ్రణం.

ఈ విధంగానే - బెంగాలును పంజాబును తల్చుకున్నపుడల్లా నా మనోవీధిలో అస్థిపంజరాలు గమిస్తాయి - వాటితోకూడా 'వణకు నేటికో నా అస్థి పంజరమ్ము'.

ఒక్క చరుపు చరిచి 'టీ' తాగు - అన్నాడు ఘోషాల్. నేను టీ తాగడం ఆరంభించా-'దాదా! ఇన్ని ప్రశ్నలు వేశావుగాని మన అరుణ గురించి అడిగావు కావు' అన్నాడు, గట్టి దమ్ము ఒకటి లాగి. నేను అడగలేదు. కాని నా హృదయాన్ని ప్రతిబింబిస్తూన్న కళ్ళు అడుగుతున్నాయి. ఇన్ని ప్రశ్నలువేసి తన చెల్లెలి గురించి అడగక పోవ

దానికి కారణం ఘోషాల్‌కు తెలుసును. మేమిద్దరం జీవితమృగతృష్ణవెంట తెగపరుగెత్తేం. మమ్మల్ని బాగా కనిపెట్టేవాడు ఘోషాల్. 'దాదా! అది మృగతృష్ణ మాత్రమే—మీరెంత పరుగెత్తినా దాన్ని చేరుకోలేరు' అని హెచ్చరించేవాడు. నేను అరుణని పాడమనేవాడిని—ఆమె 'నువ్విప్పుడు కలలో చూస్తున్నది నన్నేనా, నన్నేనా, నన్నేనా' అని అర్థంవచ్చే పాట పాడేది—ఘోషాల్ నవ్వుకుని, దిగ్గునలేచి 'దాదా నువ్వు పాడు— 'స్వప్నదేశపు రాకుమారా— ఎంతదూరంలో వున్నావు నువ్వు' అని పారిపోయేవాడు.

'అరుణ నా కళ్ళముందు చచ్చిపోలేదు గాని, నా కళ్ళముందు జీవించడం కూడా లేదు' అని సిగరెట్టుపెట్టె నులిపిపారవేశాడు.

మర్నాడుకూడా వుంటానన్నా వినకుండా, ఈవూళ్లో చూడడానికి వింతలేమీ లేవు అని ఆ రాత్రిబండికే కలకత్తా ప్రయాణం కట్టించా ఆ పాషాణహృదయుణ్ణి.

రైలు కుయ్యగానే నాభుజం తడుతూ 'దాదా ధైర్యంకావాలి యీ నరకరాజ్యంలో, ఇరవయ్యో శతాబ్దిలో వుండాలంటే యావత్తుకుటుంబాన్ని మృత్యువు కప్పజెప్పి, నేను మరణంలో జీవనం కల్పించుకుంటున్నాను—కడుపులో చల్ల కదలని విశాఖజిల్లాలో కూర్చుని జీవనంలో మరణం కొనుక్కుంటున్నావు నువ్వు. నీహృదయంలో ప్రణాళే మెదులుతూంటే నాహృదయంలో బాకులు తాండవిస్తున్నాయి' అంటూంటే రైలు వెళ్ళిపోతూంది. అతడు నావెంపుతిరిగి గట్టిదమ్ము లాగాడు—ఒక్కసారి నా తల వేడెక్కిపోయింది—'ఉండిపో, వుండిపో' అని అరిచింది నా అంతరాత్మ. దానికి రైలుకూతే సమాధానం.

# సంఘస్వామ్యం: కుటుంబవ్యవస్థ

'సామాన్యుడు'

తమ దుస్థితికి కారణాలను యితరులకు ఆరోపించడం బహుసంఖ్యాకుల్లో ఒక దౌర్బల్యం. స్వరాజ్యం రాక మునుపు మనదేశంలో జాతిలో వుండే లోపాలన్నీ విదేశీయుల పరిపాలనకు ఆరోపించాము. ఇప్పుడు స్వరాజ్యంవచ్చి ఏడాది గడిచిపోయినా ఆలోపాలన్నీ అట్లాగేవున్నవి స్వరాజ్యంవల్ల సామాన్యుడికి ఏంప్రయోజనమని ప్రతివాడూ అడుగుతున్నాడు. మన యీ లోపాలకు కారణం కేవలం విదేశ పరిపాలన మాత్రమే కాదంటే రెండేళ్ళకు ముందు ప్రతీవాడూ కర్రచ్చుకు లేచేవాడు. ఆత్మానుభవమయితేగాని తత్వం వంటబట్టదు.

ఇల్లాగే, దక్షిణాదిన సంఘంలో లోపాలకూ, అనర్థకాలకూ కారణం కేవలం బ్రాహ్మణులని విశ్వసించే వారున్నారు.

## మత పరిణామాల గతి

ప్రపంచంలో మతపరిణామాల్లో, ఒకదశలో, మతాచార్యులు తమ స్థితినీ, పలుకుబడినీ అర్థలాభానికీ, సుఖలాలసత్వానికీ వినియోగించి, తమ అనుచరుల్లో తీవ్రమయిన అవిశ్వాసాన్నీ, తిరుగుబాటునూ కలిగించారు. ఇది ప్రపంచంలో అన్ని మతాల్లోనూ జరిగింది. అల్లాగే మతసాంఘికాచారములకు కారణభూతులయిన బ్రాహ్మణులూ ఒక దశలో కొన్ని పొరపాట్లుచేసి వుండవచ్చును. కాని, అంత మాత్రాన పాపాలకల్లా భైరవులు వీళ్లే ననడంలో న్యాయమూ, అర్థమూ లేవు.

అయిదుకోట్లమంది జనాభాలో మహావుంటే ఏడెనిమిది లక్షలమంది బ్రాహ్మణులు వుండవచ్చును. వాళ్లని అణచి వేయడానికి తక్కిన వాళ్ళందరూ కక్ష వహించడంలో పౌరుషం మొగతనమూ కనిపించవు.

## ఉద్యోగాల్లో కులాభిమానం

అధికారంలో వున్నవాళ్లు తమ బంధువులనో స్నేహితులనో ఆదరించడం సహజం. కేవలం బ్రాహ్మణుడని బ్రాహ్మణ అధికారీ, బ్రాహ్మణే